RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక


బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక
NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 76 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | గురువారం 17.09.2026 | పేజీలు : 8 | వెల : 4/-

భారత నౌకను ఢీకొన్న పాక్ నౌక..

ఇస్లామాబాద్ రాయబారికి సమన్లు

- అంతర్జాతీయ జలాల్లో సెప్టెంబరు 15న ఘటన
- ఘటనలో పెద్దగా నష్టం జరగలేదన్న భారత వర్గాలు
- పాక్ రాయబారికి భారత్ సమన్లు
- పాక్ నౌక వ్యవహారంపై తీవ్ర నిరసన
- 1991 ఒప్పందం ఉల్లంఘించిందన్న భారత్

2



భారత్‌తో న్యూజిలాండ్ భారీ డీల్..

95 శాతం ఎగుమతులపై సుంకాల తగ్గింపు!

- న్యూజిలాండ్ పార్లమెంట్‌లో ఎఫ్‌టీఏ బిల్లుకు ఆమోదం
- 57 శాతం ఎగుమతులకు వెంటనే సుంకం మినహాయింపు
- పూర్తిస్థాయిలో 95 శాతం ఎగుమతులకు సుంకాల తగ్గింపు
- కివీ పరిశ్రమకు 125 మిలియన్ న్యూజిలాండ్ డాలర్ల వరకు ఆదా

2



ఓటుకు నోటు కేసు..

రేవంత్ రెడ్డి, సండ్ర పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ

- పిటిషన్లపై విచారణ జరిపిన సీజేఐ ధర్మాసనం
- ఈ అంశంపై విచారణ జరిపే పరిధి ఏసీబీకి లేదన్న పిటిషనర్ల తరపు లాయర్లు
- నాటి నిబంధనల ప్రకారం ఈ అంశాన్ని ఎన్నికల ప్రక్రియగానే చూడాలని వాదన



నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు. 2015లో కేసు నమోదైన నాటికి అమల్లో ఉన్న చట్టాలను ప్రస్తావిస్తూ... నాటి నిబంధనల ప్రకారం లంచం ఇవ్వడం/తీసుకోవడం అనే ప్రక్రియను ఎన్నికల కేసుగా చూడాలి తప్ప, అవినీతి నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించలేమని న్యాయవాదులు వాదించారు. గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొదటి నుంచి చేపట్టింది. ఇరు పక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.

సెప్టెంబర్ 17 వేడుకలు

- కేంద్ర ఉత్సవాలకు ఉపరాష్ట్రపతి.. రాష్ట్ర కార్యక్రమానికి రేవంత్ రెడ్డి





- సెప్టెంబర్ 17న కేంద్రం, రాష్ట్రం వేర్వేరు పేర్లతో వేడుకలు
- కేంద్ర విమోచన వేడుకలకు అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా ఆవిష్కరణ
- రాష్ట్రంలో 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహణ
- సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వేడుకలు

నిత్యం నిఘా, హైదరాబాద్ : హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలకు ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి, సీఏపీఎఫ్ బలగాల పరేడ్‌ను పరిశీలించనున్నారు. గత కొన్నేళ్లుగా సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఈ వేడుకలు నిర్వహిస్తోంది. లంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ తదితరులు కార్యక్రమానికి హాజరుకానున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. 32 జిల్లాల కేంద్రాల్లో మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ప్రజాప్రతినిధులు జెండా ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించనున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీల్లోనూ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. ఈ రోజును ఏ పేరుతో నిర్వహించాలన్న దానిపై తెలంగాణలో కొన్నేళ్లుగా రాజకీయ భేదాభిప్రాయాలు ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022, 2023లో 'జాతీయ సమైక్యతా దినోత్సవం'గా నిర్వహించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం 2024 నుంచి 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం మాత్రం 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా వేడుకలు నిర్వహిస్తోంది.

మోదీ 76వ పుట్టినరోజు : 76 రకాల వంటకాలతో తమిళనాడు చెఫ్ వినూత్న శుభాకాంక్షలు

- మోదీ 76వ పుట్టినరోజుకు తమిళనాడు చెఫ్ వినూత్న కానుక
- ఆరోగ్యకరమైన 76 రకాల సలాడ్లతో ప్రత్యేక విందు ఏర్పాటు
- పుచ్చకాయలపై ప్రధాని మోదీ, ఆయన తల్లి హీరాబెన్ చిత్రాల చెక్కడం
- ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రోత్సహించడమే లక్ష్యమన్న చెఫ్ సెల్వకుమార్

2



అంతా అబద్ధం..

రేవంత్ రెడ్డి ఆరోపణలకు కవిత కౌంటర్



- ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని సవాల్
- తనతో పాటు పలువురి ఆస్తులపైనా సీబీఐ విచారణకు డిమాండ్
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై ఎదురుదాడి
- గుంపు మేస్త్రీ, గుంటనక్క కలిసే ఉన్నారని కవిత విమర్శ
- ముఖ్యమంత్రిపై తమకు నమ్మకం లేదని వ్యాఖ్య

2

'మరి హరీశ్‌రావు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు?'

- పొంగులేటి ఘాటు వ్యాఖ్యలు



- అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై ప్రశ్నలు
- పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై నకిలీ ఎన్ఓసీ ఆరోపణ
- గంగుల కమలాకర్ భూముల పైనా మంత్రి వ్యాఖ్యలు
- 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములని వెల్లడి
- 47,440 ఎకరాలు తగ్గించినట్లు ప్రభుత్వం వెల్లడి

2

యూపీఐపై కొత్త రుసుము.. తిరిగి నగదు వైపు అడుగులేనా?

- కొన్ని యూపీఐ లావాదేవీలపై కొత్తగా మర్చంట్ డిస్కౌంట్ రేట్
- రూ. 2000 దాటిన వ్యాపార చెల్లింపులపై రుసుము విధింపు
- తిరిగి నగదు లావాదేవీలు పెరగొచ్చని రిటైలర్ల సంఘం ఆందోళన
- వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు లేవని స్పష్టం చేసిన కేంద్రం

నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : యూపీఐ ద్వారా జరిగే కొన్ని వ్యాపార లావాదేవీలపై కొత్తగా మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించడం పట్ల రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఏఐ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నిర్ణయం దేశాన్ని మళ్లీ నగదు ఆధారిత ఆర్థిక వ్యవస్థ వైపు మళ్లించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. 2026 అక్టోబర్ 15వ తేదీ నుంచి అమల్లోకి రానున్న ఈ నూతన నిబంధనల ప్రకారం, రూ. 2,000 దాటిన వ్యాపార చెల్లింపులపై ఈ రుసుము వర్తిస్తుంది. కొత్త నిబంధనల మేరకు, వినియోగదారుల నుంచి వ్యాపారులకు జరిగే రూ. 2,000 పైబడిన చెల్లింపులపై 0.4 శాతం ఎండీఆర్ విధిస్తారు. రైల్వే, టెలికాం, ఇన్సూరెన్స్, ఇంధనం వంటి రంగాలకు ఫ్లాట్‌గా రూ. 5 రుసుము ఉంటుంది. అయితే, యూపీఐ క్యూఆర్ కోడ్‌ల ద్వారా .....

2

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

సంగారెడ్డిలో గణేశ్ నిమజ్జనం వేళ ఆరుగురు విద్యార్థుల మృతి..



నిత్యం నిఘా, సంగారెడ్డి : వినాయక నిమజ్జన వేడుకల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని పెదకంజర్ల గ్రామ శివారులో ఉన్న నేరేడు చెరువులో మునిగి ఆరుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో పండుగ వాతావరణం ఒక్కసారిగా విషాదమయమైంది. మృతులంతా శిరీష అనాథాశ్రమానికి చెందిన విద్యార్థులుగా గుర్తించారు. శిరీష అనాథాశ్రమానికి చెందిన విద్యార్థులు గణేశ్ విగ్రహ నిమజ్జనం కోసం నేరేడు చెరువు వద్దకు వెళ్లారు. నిమజ్జనం చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు వారు ఒకరి తర్వాత ఒకరు నీటిలో మునిగి పోయారు. సమాచారం అందుకున్న పటాన్‌చెరు పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్ల సహాయంతో గాలించి విద్యార్థుల మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆసుపత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. అనాథాశ్రమ నిర్వాహకులను పరామర్శించిన ఆయన, ఈ ఘటనపై తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతులను నర్సింహ రాజు, సుమంత్ (డిప్లొమా), గణేశ్ (డిప్లొమా), ఉదయ్ కిరణ్ (డిప్లొమా), శ్యామ్ కుమార్ (డిప్లొమా), సిద్ధార్థ్ (10వ తరగతి)గా గుర్తించారు. ఈ హృదయవిదారక ఘటనతో స్థానికంగా తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

'మరి హరీశ్‌రావు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు?'

.. పొంగులేటి ఘాటు వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి..

మాజీ మంత్రి హరీశ్‌రావుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తప్పేనని, అలాంటప్పుడు హరీశ్‌రావు మామ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. ''అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది?'' అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన పొంగులేటి.. తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్ఓసీ ఇచ్చిందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించారు. అసైన్డ్ భూములకు అనుమతి ఇవ్వడం చట్టబద్ధం కాదని, ఏ ప్రభుత్వం అలా చేసినా తప్పేనని అన్నారు. ఆ విషయం హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్ఓసీతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. అది కూడా తప్పేనని అన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఏ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితాపైనా పొంగులేటి కీలక వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో ఉన్న భూముల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలిన భూమంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలు తగ్గించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై త్వరలోనే పూర్తి వివరాలు బయటపెడతామని పొంగులేటి తెలిపారు. 22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనుందని చెప్పారు.

అంతా అబద్ధం.. రేవంత్ రెడ్డి ఆరోపణలకు కవిత కౌంటర్

మొదటిపేజీ తరువాయి.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు. కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన 'గుంటనక్క'తో పాటు కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. 'గుంపు మేస్త్రీ – గుంటనక్క' ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.

యూపీఐపై కొత్త రుసుము.. తిరిగి నగదు వైపు అడుగులేనా?

మొదటిపేజీ తరువాయి.. నెలకు రూ. 1 లక్ష లోపు లావాదేవీలు నిర్వహించే చిన్న వ్యాపారులకు ఈ ఛార్జీల నుంచి మినహాయింపు కల్పించారు. ఈ మార్పు కేవలం 4 శాతం లావాదేవీలపై మాత్రమే ప్రభావం చూపుతుందని, మిగిలిన 96 శాతం వ్యాపార లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ నిర్ణయంపై రిటైలర్ల సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. "తక్కువ లాభాలతో పనిచేసే చిన్న వ్యాపారులు ఇకపై యూపీఐ కంటే నగదు లావాదేవీలకే ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది" అని ఆర్ఏఐ సీఈఓ కుమార్ రాజగోపాలన్ పేర్కొన్నారు. దీపావళి పండుగ సీజన్‌కు ముందు ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సరైంది కాదని, ఇది వ్యాపారాలపై మరింత భారం మోపుతుందని క్లాతింగ్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సంతోష్ కటారియా తెలిపారు. గతంలో నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించిన వ్యాపారులే, ఇప్పుడు తిరిగి నగదును ప్రోత్సహించే పరిస్థితి నెలకొంటుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఛార్జీలు ప్రభుత్వ పన్ను కాదని, యూపీఐ వ్యవస్థను నిర్వహించే బ్యాంకులకు, పేమెంట్ యాప్ సంస్థలకు వెళ్లే రుసుము అని ప్రభుత్వ వర్గాలు వివరించాయి. ఈ నిర్ణయాన్ని ఐదేళ్ల క్రితమే ప్రతిపాదించామని, దీనిని వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశాయి. వినియోగదారులపై ఎలాంటి భారం పడదని ప్రభుత్వం పునరుద్ఘాటించింది. వెరసి, ఈ మార్పుల ప్రభావం వ్యాపారులపైనే ఉంటుంది తప్ప, సాధారణ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

భారత్‌తో న్యూజిలాండ్ భారీ డీల్.. 95 శాతం ఎగుమతులపై సుంకాల తగ్గింపు!

మొదటిపేజీ తరువాయి.. భారత్–న్యూజిలాండ్ మధ్య వాణిజ్య సంబంధాల్లో కీలక ముందడుగు పడింది. ఇరు దేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) అమలుకు అవసరమైన బిల్లును న్యూజిలాండ్ పార్లమెంట్ ఆమోదించింది. బిల్లుకు అనుకూలంగా 93 మంది ఎంపీలు ఓటేయగా.. 29 మంది వ్యతిరేకించారు. ఒప్పందం అమల్లోకి వచ్చిన వెంటనే న్యూజిలాండ్ నుంచి భారత్‌కు వెళ్లే ఎగుమతుల్లో 57 శాతానికి సుంకం ఉండదు. పూర్తిస్థాయిలో అమలు జరిగితే 95 శాతం ఎగుమతులపై సుంకాలు పూర్తిగా తొలగిపోవడం లేదా భారీగా తగ్గడం జరుగుతుంది. దీంతో భారత మార్కెట్‌లో న్యూజిలాండ్ ఉత్పత్తులకు మరింత అవకాశం దక్కనుంది. కివీ పండ్ల పరిశ్రమకు ఈ ఒప్పందం భారీ ఊరటనివ్వనుంది. వచ్చే ఐదేళ్లలో సుంకాల రూపంలో సుమారు 125 మిలియన్ న్యూజిలాండ్ డాలర్లు ఆదా అవుతాయని అంచనా. సరిహద్దుల్లో సరకుల తనిఖీ, క్లియరెన్స్ ప్రక్రియ కూడా వేగవంతం కానుంది. భారత్‌లో పెరుగుతున్న మధ్యతరగతి.. న్యూజిలాండ్ ఎగుమతిదారులకు పెద్ద మార్కెట్‌గా మారుతోందని ఆ దేశ వాణిజ్య, పెట్టుబడుల మంత్రి టాడ్ మెక్లే చెప్పారు. ఆహారం, టెక్నాలజీ, విద్య, పర్యాటకం, ప్రొఫెషనల్ సర్వీసెస్‌కు భారత్‌లో పెరుగుతున్న డిమాండ్‌ను న్యూజిలాండ్ కంపెనీలు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఇరు దేశాల ఆమోద ప్రక్రియలు పూర్తయిన తర్వాత ఎఫ్‌టీఏ అమల్లోకి వస్తుంది. ఈ ఏడాది చివర్లోనే ఒప్పందం అమల్లోకి వచ్చే అవకాశం ఉందని మెక్లే చెప్పారు. 2030 నాటికి భారత్–న్యూజిలాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యాని కి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని తెలిపారు. ఇదిలా ఉండగా.. వెస్ట్‌పాక్ ఇన్‌స్టిట్యూషనల్ బ్యాంక్ ఇటీవల ఇచ్చిన నివేదికలోనూ భారత్ వృద్ధి అవకాశాలను ప్రస్తావించింది. ఎఫ్‌టీఏ వల్ల వచ్చే పదేళ్లలో న్యూజిలాండ్ జీడీపీకి దాదాపు 0.1 శాతం అదనపు వృద్ధి రావచ్చని అంచనా వేసింది.

భారత నౌకను ఢీకొన్న పాక్ నౌక.. ఇస్లామాబాద్ రాయబారికి సమన్లు

మొదటిపేజీ తరువాయి.. అరేబియా సముద్రంలో భారత నౌకాదళానికి చెందిన ఓ నౌకను పాకిస్థాన్ నేవీకి చెందిన నౌక ఢీకొన్న ఘటనపై భారత్ తీవ్రంగా స్పందించింది. పాకిస్థాన్ హైకమిషన్ చార్జ్ డి అఫైర్స్ సాద్ అహ్మద్ వారైచ్‌ను బుధవారం విదేశాంగ శాఖ పిలిపించి నిరసన తెలిపింది. పాకిస్థాన్ నౌకాదళ యూనిట్ వ్యవహరించిన తీరు ''ఆమోదయోగ్యం కానిది, వృత్తిపరమైన ప్రమాణాలకు విరుద్ధం'' అని భారత్ పేర్కొంది. ఈ ఘటన నిన్న (సెప్టెంబరు 15) సాయంత్రం ఉత్తర అరేబియా సముద్రంలో అంతర్జాతీయ జలాల్లో జరిగినట్లు సమాచారం. సాధారణ నిఘా విధుల్లో ఉన్న భారత నౌకకు పాకిస్థాన్ నౌక వేగంగా సమీపానికి వచ్చి, సురక్షితం కాని రీతిలో దిశ మార్చుకుంటూ వచ్చి ఢీకొన్నట్లు భారత వర్గాలు తెలిపాయి. ఘటనలో పెద్దగా నష్టం జరగలేదని పేర్కొన్నాయి. పాకిస్థాన్ నౌక వ్యవహరించిన తీరు 1991లో భారత్, పాకిస్థాన్ మధ్య కుదిరిన సైనిక విన్యాసాలు, కదలికలకు ముందస్తు సమాచారం ఇచ్చే ఒప్పందంలోని ఆర్టికల్ 10కు విరుద్ధంగా ఉందని విదేశాంగ శాఖ తెలిపింది. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా పాకిస్థాన్ సైనిక యూనిట్లు సముద్రంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, ఇరు దేశాల మధ్య ఉన్న ఒప్పందాలను గౌరవించాలని ఆ దేశ రాయబారికి భారత్ సూచించింది. ఈ సందేశాన్ని పాకిస్థాన్ విదేశాంగ శాఖకు చేరవేయాలని ఆదేశించింది. ఇదే సమయంలో ఇస్లామాబాద్‌లోని భారత చార్జ్ డి అఫైర్స్ కూడా పాకిస్థాన్ విదేశాంగ శాఖకు అధికారికంగా నిరసన తెలియజేయాలని కేంద్రం సూచించింది.

మోదీ 76వ పుట్టినరోజు : 76 రకాల వంటకాలతో తమిళనాడు చెఫ్ వినూత్న శుభాకాంక్షలు

మొదటిపేజీ తరువాయి.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ పుట్టినరోజు (సెప్టెంబరు 17) సందర్భంగా దేశ వ్యాప్తంగా వేడుకలకు ఏర్పాట్లు జరుగుతుండగా, తమిళనాడుకు చెందిన ఓ చెఫ్ తన అభిమానాన్ని అత్యంత వినూత్నంగా చాటుకున్నారు. ప్రధాని మోదీకి 76 ఏళ్లు నిండిన సందర్భంగా, ఏకంగా 76 రకాల వంటకాలను సిద్ధం చేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. తమిళనాడులోని తిరునల్వేలికి చెందిన ప్రముఖ చెఫ్ సెల్వకుమార్ ఈ అరుదైన కానుకను సిద్ధం చేశారు. కేవలం వంటకాలతోనే ఆగకుండా, పుచ్చకాయలపై ప్రధాని మోదీ, ఆయన దివంగత తల్లి హీరాబెన్ మోదీ చిత్రాలను అందంగా చెక్కారు. ప్రధాని యువకుడిగా ఉన్నప్పటి చిత్రం, ప్రస్తుత రూపాన్ని కూడా పుచ్చకాయలపై ఆవిష్కరించి తన కళానైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఆరోగ్యకరమైన, సహజ సిద్ధమైన ఆహారాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో 'నో–కుక్' (వండకుండా చేసే) థీమ్‌తో ఈ 76 రకాల వంటకాలను తయారు చేయడం విశేషం. వీటిలో 24 రకాల కూర



గాయలు, పండ్లతో చేసిన సలాడ్లు, 26 రకాల మొలకెత్తిన పప్పులతో చేసిన సలాడ్లు, 14 రకాల దుంపలతో తయారుచేసిన సలాడ్లు ఉన్నాయి. ఈ సందర్భంగా చెఫ్ సెల్వకుమార్ మాట్లాడుతూ, ప్రధాని మోదీపై తనకున్న అభిమానాన్ని చాటుకునేందుకే ఇలా చేశానని తెలిపారు. సహజసిద్ధమైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని ప్రజలకు తెలియజేయడానికే ఈ 76 రకాల వంటకాలు సిద్ధం చేశానన్నారు. ప్రధాని ఆయురారోగ్యాలతో ఉంటూ దేశానికి మరిన్ని సేవలు అందించాలని మన స్ఫూర్తిగా ఆకాంక్షించారు. కాగా, సెప్టెంబర్ 17న ప్రధాని మోదీ 76వ పుట్టినరోజు సందర్భంగా దేశవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం సెల్వకుమార్ సిద్ధం చేసిన ఈ ప్రత్యేక వంటకాలు, పుచ్చకాయల చిత్రాలు సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తూ ప్రశంసలు అందుకుంటున్నాయి.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

పారిశుధ్యంపై కమిషనర్ వెంకన్న ఆకస్మిక తనిఖీలు

- **విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**
- **డ్రైనేజీల పూడికతీత, చెత్త తొలగింపుపై ప్రత్యేక దృష్టి**



వరంగల్,సెప్టెంబర్ 16(నిత్యం నిఘా ప్రతినిధి): గ్రేటర్ వరంగల్ నగరంలో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్టం చేసేందుకు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గురువారం ఉదయం హనుమకొండ, వరంగల్ నగరంలోని పలు ప్రధాన రహదారులు, నివాస కాలనీలు, వ్యాపార ప్రాంతాలు, రద్దీ కూడళ్లలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. రహదారుల వెంట పేరుకుపోయిన చెత్త, డ్రైనేజీల పరిస్థితి, పరిసరాల పరిశుభ్రతను కమిషనర్ నిశితంగా పరిశీలించారు. ఎక్కడైనా చెత్త పేరుకుపోతే వెంటనే తొలగించాలని, డ్రైనేజీల్లో పూడిక పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పూడికతీత చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో పారిశుధ్య లోపాల కారణంగా వ్యాధులు, దోమల వ్యాప్తికి అవకాశం ఉన్నందున ప్రత్యేక అప్రమత్తత పాటించాలని సూచించారు. పారిశుధ్య కార్మికులతో కమిషనర్ స్వయంగా ముఖాముఖి మాట్లాడి వారి విధులు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి అలసత్వానికి తావివ్వొద్దని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగర పరిశుభ్రత కేవలం మున్సిపల్ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు కూడా రోడ్లపై, కాలనీల్లో చెత్త వేయకుండా మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు అందించాలని కోరారు. ప్రజలు, పారిశుధ్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తేనే నగరాన్ని పరిశుభ్రంగా ఉంచగలమన్నారు. తనిఖీల్లో జీడబ్ల్యూఎంసీ ఆరోగ్య అధికారులు, పారిశుధ్య పరిశీలకులు, స్థానిక మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ రక్షణ చట్టం కోసం పార్లమెంట్‌లో చర్చించాలి

- **హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని ఎంపీ, ఎమ్మెల్యేకు వినతి**
- **ముఖ్యమంత్రి, డీజీపీ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని డిమాండ్**





హనుమకొండ, సెప్టెంబర్ 16: (నిత్యం నిఘా ప్రతినిధి):
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత, బహుజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతిపత్రాలు అందజేశారు. అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న హమారా ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేసి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్‌ను కల్పిత నాయకుడిగా పేర్కొంటూ పుస్తకాన్ని ఈ నెల 18న ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి, రాష్ట్ర డీజీపీ దృష్టికి తీసుకెళ్లి చట్టపరంగా పరిష్కరించాలని ఎంపీ, ఎమ్మెల్యేలను కోరారు.అంబేద్కర్‌పై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం, అనుచితంగా మాట్లాడటం, ఆయన విగ్రహాలను ధ్వంసం చేయడం వంటి ఘటనలను నిరోధించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. అంబేద్కర్ గౌరవం, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టానికి సంబంధించిన బిల్లుపై చర్చ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ కడియం కావ్యను కోరారు. ఈ కార్యక్రమంలో దళిత, బహుజన సంఘాల నాయకులు సిద్ధిరాజ్ యాదవ్, కేడల ప్రసాద్, అంకూస్ రవికుమార్, మైదం జయపాల్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాయొద్దు

- **హనుమకొండలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఒకరోజు నిరసన దీక్ష**
- **న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలి: రాగుల రమేష్**



హనుమకొండ,సెప్టెంబర్ 16: (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రజాస్వామ్యంలో తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ అన్నారు. ప్రభుత్వ నిర్బంధ వైఖరిని నిరసిస్తూ హనుమకొండలోని ఏకశిలా పార్క్ వద్ద కార్మికుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఒకరోజు నిరసన దీక్షకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులు, ప్రజా సంఘాలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆందోళనలు చేపడుతుంటే పోలీసులు, అధికారుల ద్వారా నిర్బంధాలు విధించడం సరికాదని రాగుల రమేష్ అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత పాలకులపై ఉందని, వారి హక్కులను అణచివేయడం పరిష్కారం కాదన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎలాంటి నిర్బంధాలు ఎదురైనా ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ హక్కుల కోసం పోరాటాన్ని కొనసాగించాలని సూచించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్షకు సీఐటీయూ జిల్లా, క్షేత్రస్థాయి నాయకులు, కార్మికులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై మద్దతు తెలిపారు.

అన్నదాన కార్యక్రమంలో ఎర్రబెల్లి ప్రదీప్ రావు

- **గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ రాష్ట్ర నాయకుడు**
- **యువజ్యోతి యూత్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం**





వరంగల్, సెప్టెంబర్16(నిత్యం నిఘా ప్రతినిధి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని అబ్బనికుంటలో యువజ్యోతి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్న వితరణ చేశారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న యువజ్యోతి యూత్ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కనుకుంట్ల రంజిత్, తమ్మిశెట్టి క్రాంతి, పేరాల భాస్కర్, మార్గం జనార్దన్‌తో పాటు స్థానిక నాయకులు, యువజ్యోతి యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల హామీల అమలులో కాలయాపన ఎందుకు?

- **సెప్టెంబర్ 17న కిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా**
- **250 గజాల ఇంటి స్థలం, రూ.25 వేల పింఛన్ అమలు చేయాలి: మరుపల్ల రవి**



వరంగల్, సెప్టెంబర్16(నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 17న కిలా వరంగల్ మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వరంగల్ ఉమ్మడి జిల్లాల ఉద్యమకారుల సంఘం కన్వీనర్ మరుపల్ల రవి తెలిపారు. ఉర్సు ప్రతాప్‌నగర్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లాల ఉద్యమకారుల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అప్పటి ఉద్యమ నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు అనేక ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొని అరెస్టులు, కేసులు ఎదుర్కొన్నామని మరుపల్ల రవి తెలిపారు. కొందరు ఉద్యమకారులు జైలు జీవితం కూడా గడిపారని పేర్కొన్నారు. రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ హామీలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల గౌరవ పింఛన్ తదితర హామీల అమలులో జాప్యం జరుగుతోందని ఆయన ఆరోపించారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17న నిర్వహించనున్న ధర్నాకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఉద్యమకారులందరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మరుపల్ల రవి పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే భవిష్యత్‌లో మరింత విస్తృత స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు. సమావేశంలో ఉద్యమకారులు నాగవెల్లి సాంబయ్య, మేకల ఎల్లయ్య, శంకేసి లింగమూర్తి, అంకం దేవానంద్, కెంచ ఆనంద్, ఐత ప్రభాకర్, మాడిశెట్టి రాజ కుమార్, ఆవునూరు లక్ష్మి , ముసినిపెల్లి జమున, కొడిపాక రమాదేవి, నేల మల్లమ్మ, చిదురాల సుజాత, సోమ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గంగాపురిలో కోతుల బీభత్సం..

- **దాడులు జరుగుతున్నా అధికారుల చర్యలేవి?**
- **మున్సిపల్ చైర్మన్ ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికుల డిమాండ్**



మంథని, సెప్టెంబర్16(నిత్యం నిఘా ప్రతినిధి): మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురిలో కోతుల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోంది. గుంపులుగా సంచరిస్తున్న కోతులు ఇళ్లలోకి చొరబడటంతో పాటు రోడ్లపై తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. తాజాగా గంగాపురికి చెందిన అంగన్‌వాడీ టీచర్ గుండేటి పద్మ చిన్నారులకు పాఠాలు చెబుతున్న సమయంలో కోతుల దాడిలో గాయపడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. గంగాపురిలో ఇప్పటికే వృద్ధులు, మహిళలు, యువకులు, చిన్నారులపై కోతులు దాడి చేసిన ఘటనలు చోటుచేసుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. కోతుల దాడుల భయంతో పిల్లలను బయటకు పంపాలన్నా, వృద్ధులు ఒంటరిగా వెళ్లాలన్నా ఆందోళన చెందాల్సి వస్తోందని వాపోతున్నారు.

పలుమార్లు ఫిర్యాదులు.. అయినా పరిష్కారం ఏది?

కోతుల బెడదపై పలుమార్లు పత్రికల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, సంబంధిత ప్రజాప్రతినిధులను కలిసి సమస్యను వివరించినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు అంటున్నారు. సమస్య తీవ్రత అధికారులకు తెలిసినప్పటికీ కోతుల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరో ప్రమాదం జరిగే వరకు వేచి చూడాలా?

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే చిన్నారులు, సిబ్బందితో పాటు వృద్ధులు, మహిళలు, యువకులు నిత్యం కోతుల భయంతో గడపాల్సిన పరిస్థితి నెలకొందని గంగాపురి వాసులు చెబుతున్నారు. ఇప్పటికే దాడులు జరుగుతున్న నేపథ్యంలో మరిన్ని ప్రమాదాలు చోటుచేసుకోకముందే అధికారులు స్పందించాలని కోరుతున్నారు. మున్సిపల్ చైర్మన్ గంగాపురి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత అధికారులతో సమన్వయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. కోతుల నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ప్రజలకు రక్షణ కల్పించేలా తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

గంగాపురిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం
- కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్‌బాబు





మంథని, సెప్టెంబర్16(నిత్యం నిఘా ప్రతినిధి): మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నాలుగో వార్డు కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్‌బాబు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన కుటుంబాలకు ప్రస్తుతం స్మార్ట్ రేషన్ కార్డులు అందుతున్నాయని తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో కార్డుల మంజూరు ప్రక్రియ ముందుకు సాగిందని, ముఖ్యమంత్రి సహకారం కూడా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని చెప్పారు. కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పేద కుటుంబాలకు ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందే అవకాశం ఉంటుందని కౌన్సిలర్ తెలిపారు. కార్యక్రమంలో గంగాపురికి చెందిన లబ్ధిదారులు పాల్గొన్నారు.

22 - ఎ జాబితా నుంచి ప్రైవేటు ఆస్తులను తక్షణమే తొలగించాలి

- వివాదం లేని భూముల యజమానులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- కలెక్టర్‌కు టీడీపీ నాయకుల వినతి



హనుమకొండ,సెప్టెంబర్16: (నిత్యం నిఘా ప్రతినిధి): సెక్షన్ 22-ఎ నిషేధిత జాబితాలో చేర్చిన ప్రైవేటు ఆస్తులను సమీక్షించి, వివాదం లేని భూములను వెంటనే జాబితా నుంచి తొలగించాలని కోరుతూ వరంగల్ పార్లమెంట్ టీడీపీ నాయకులు హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ టీడీపీ కన్వీనర్ అర్రనపల్లి విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ పలు సర్వే నంబర్లలో కొంత భూమి మాత్రమే వివాదంలో ఉన్నప్పటికీ, మొత్తం సర్వే నంబర్‌ను 22-ఎ నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల వివాదంతో సంబంధం లేని భూముల యజమానులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిషేధిత జాబితాలో ఆస్తులు ఉండటంతో వాటిని విక్రయించుకోవడానికి యజమానులు ఇబ్బందులు పడుతున్నారని, అత్యవసర ఆర్థిక అవసరాల సమయంలో సొంత ఆస్తులను వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు సైతం ఇటువంటి భూములపై రుణాలు మంజూరు చేయకపోవడంతో వ్యాపారాలు, విద్య, వైద్యం వంటి అవసరాలకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వివాదంలో ఉన్న భూములను మాత్రమే గుర్తించి, మిగిలిన ప్రైవేటు ఆస్తులను 22-ఎ నిషేధిత జాబితా నుంచి తొలగించేలా అధికారులు సమగ్రంగా సమీక్షించాలని టీడీపీ నాయకులు కోరారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించి బాధిత ఆస్తుల యజమానులకు ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో టీడీపీ ముఖ్య నాయకులు, నియోజకవర్గ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టుల పునరావాస ప్రక్రియ వేగవంతం చేయాలి

- అర్హులందరికీ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రయోజనాలు కల్పించాలి
- జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ హేమంత్ సహదేవరావు ఆదేశాలు



ములుగు,సెప్టెంబర్16 (నిత్యం నిఘా ప్రతినిధి): లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ పునరావాస ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ములుగు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి సమావేశానికి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందించాల్సిన ఆర్థిక సహాయం, ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములు, ఉపాధి అవకాశాలు తదితర పునరావాస ప్రయోజనాలపై అధికారులు సమగ్రంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిశీలించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై నిర్ణయాలు తీసుకున్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రయోజనాలు సకాలంలో అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తులు, ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, పునరావాస ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచి, పెండింగ్‌లో ఉన్న పునరావాస అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ సూచించారు.సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సీహెచ్ మహేందర్ జీ, ములుగు డీఎస్పీ రవీందర్, జిల్లా అధికారులు రామ్మోహన్, రవీందర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ నాయి దినోత్సవం సందర్భంగా జిల్లా కమిటీ సమావేశం

- వృత్తిదారుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి ఆధునిక శిక్షణ, పరికరాలు, రుణ సదుపాయాలు కల్పించాలని డిమాండ్



ములుగు జిల్లా , సెప్టెంబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): అంతర్జాతీయ నాయి దినోత్సవాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా కేంద్రంలో నాయి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వేల్పుగొండ సతీష్ నాయి బ్రాహ్మణ వృత్తిదారులకు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నాయి వృత్తి కేవలం జీవనోపాధి మాత్రమే కాదని, తరతరాలుగా కొనసాగుతున్న నైపుణ్యంతో కూడిన సేవా వృత్తి అని ఆయన పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తిదారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా శిక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తంగేళ్లపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ నాయి బ్రాహ్మణ వృత్తిదారులకు ఆధునిక పరికరాలు, ఆర్థిక సహాయం, సామాజిక భద్రత, ఆరోగ్య బీమా వంటి సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో వృత్తి నిర్వహిస్తున్న వారికి సైతం ప్రభుత్వ సంక్షేమ పథకాలు సులభంగా అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాలను రూపొందించాలని, వృత్తి అభివృద్ధికి అవసర మైన రుణ సదుపాయాలు, శిక్షణ, పరికరాల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. నాయి బ్రాహ్మణ సమాజం ఐక్యంగా ఉంటూ వృత్తిదారుల హక్కులు, సంక్షేమం కోసం కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు మురహరి కుమార స్వామి, వేల్పుగొండ రఘువీర్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు ఎం. శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం. సతీష్, జిల్లా కోశాధికారి ఎన్. వేణు, నాయకులు ఎం. సంపత్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు భయపడేది లేదు

- ప్రజల పక్షాన పోరాటం ఆపేది లేదు
- హామీల అమలు కోసం ఉద్యమం కొనసాగిస్తాం: బీఆర్ఎస్ యువ నాయకులు



వరంగల్/ సంగెం, సెప్టెంబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన అసెంబ్లీ ముట్టడి పిలుపు సందర్భంగా సంగెం మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ యువ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. బుధవారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో పెండ్లి పురుషోత్తంరెడ్డి, బొమ్మాల శంకర్, పోశాల ప్రవీణ్, జున్న రాజు, చిర్ర రాజులను వారి ఇళ్ల నుంచి తీసుకువచ్చి సంగెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ తమను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని నిరసించారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, ప్రజల తరఫున తమ పోరాటాన్ని కొనసాగిస్తామని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు, ఇతర హామీలను అమలు చేస్తామని చెప్పి ప్రజలకు హామీలు ఇచ్చిందని వారు ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు దాటినా హామీల అమలులో జాప్యం జరుగుతోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని, హామీల అమలు జరిగే వరకు ప్రజల తరఫున పోరాడుతామని బీఆర్ఎస్ యువ నాయకులు స్పష్టం చేశారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

గజులపల్లిలో పత్తి పంటపై పొలం బడి

- సమగ్ర సస్యరక్షణ, అంతర పంటల సాగుపై రైతులకు అవగాహన
- ఐపీఎం కిట్లు, వ్యవసాయ ఇన్‌పుట్‌ల పంపిణీ

పెద్దపల్లి జిల్లా/ మంథని, సెప్టెంబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): పత్తి పంటలో సమగ్ర సస్యరక్షణ, అంతర పంటల సాగు, పంట యాజమాన్య పద్ధతులు, ఆధునిక వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు పెద్దపల్లి జిల్లా మంథని మండలం గజుల పల్లి గ్రామంలో పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఐపీఎం కిట్లతో పాటు అవసరమైన వ్యవసాయ ఇన్‌పుట్‌లను పంపిణీ చేశారు. పత్తి పంటలో చీడపీడలను ప్రారంభ దశలోనే గుర్తించి పర్యావరణహిత పద్ధతుల్లో నియంత్రించాలని అధికారులు సూచించారు. రసాయన పురుగుమందులను అవసరమైన సందర్భాల్లో మాత్రమే, సూచించిన మోతాదులో వినియోగించాలని తెలిపారు. పంటను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ పురుగు ఉధృతి ఆధారంగా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి డా. నవ్య మాట్లాడుతూ పత్తిలో బహుళ పంటలు, అంతర పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. నేల సారాన్ని పరిరక్షించడంతో పాటు సమగ్ర సస్యరక్షణ పద్ధతులను రైతులు పాటించాలని సూచించారు. కేవీకే శాస్త్రవేత్త డా. భాస్కర్‌రావు విత్తనాల ఎంపిక, సమతుల్య ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. డా. కిరణ్ పత్తి మొక్కల పెరుగుదల, ఆరోగ్యకరమైన



మొక్కల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. డా. వెంకన్న రైతులకు పలు సూచనలు అందించారు. గ్రామ సర్పంచ్ కరెంగుల సుధాకర్ మాట్లాడుతూ రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం అందించేందుకు గ్రామస్థాయిలో వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు హారిక, ప్రత్యూష, సౌమ్య, కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యపై 'స్కిల్' ప్రయోగమా..?

- జీవో 97 రద్దు చేయాలి
- ఎస్‌బీటీఈటీ పరిధిలోనే పాలిటెక్నిక్ విద్య కొనసాగాలి
- 18న హైదరాబాద్‌లో మహా ధర్నా
- వరంగల్‌లో పోస్టర్ ఆవిష్కరణ

వరంగల్, సెప్టెంబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): పాలిటెక్నిక్ విద్యను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘాలు ఆందోళనకు సిద్ధమయ్యాయి. జీవో నంబర్ 97ను రద్దు చేసి, పాలిటెక్నిక్ విద్యను రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి పరిధిలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నాయి. జీవో 97పై రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ నెల 18న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థుల సంయుక్త కార్యాచరణ సమితి ప్రకటించింది. మహా ధర్నాకు విద్యార్థులను తరలించేందుకు బుధవారం వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డీఎస్ఏ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు.



'స్కిల్' పేరుతో పాలిటెక్నిక్ విద్యను మార్చొద్దు

ఈ సందర్భంగా డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడం వల్ల విద్యార్థుల విద్యా భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ విద్యకు ప్రత్యేకమైన సాంకేతిక విద్యా వ్యవస్థ, గుర్తింపు ఉన్నందున దానిని ఎస్‌బీటీఈటీ పరిధిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మాత్రం పాలిటెక్నిక్ విద్యను నైపుణ్యాభివృద్ధితో అనుసంధానించడం, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించడం, విద్యార్థులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం లక్ష్యంగా మార్పులు చేపడుతున్నట్లు చెబుతోంది. ఆగస్టులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమన్వయ కార్యాచరణ బృందంలో ఎసబ:ీటీఈటీ, ఏఐసీటీఈ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, పాలిటెక్నిక్ అధ్యాపకుల ప్రతినిధులు ఉంటారని ప్రకటించింది.

ఫీజుల పెంపుపై విద్యార్థుల ఆందోళన

పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థలో మార్పులతో భవిష్యత్తులో ఫీజులు పెరిగితే పేద, మధ్యతరగతి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జీవో 97ను ఉపసంహరించుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా, 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాలిటెక్నిక్ ప్రవేశాల కోసం రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి ఆధ్వర్యంలో పాలిసెట్ నిర్వహణ, ప్రవేశ ప్రక్రియ కొనసాగింది. విద్యార్థుల హక్కులు, పాలిటెక్నిక్ విద్య భవిష్యత్తు కోసం ఈ నెల 18న ఇందిరా పార్క్‌లో నిర్వహించనున్న మహా ధర్నాకు పెద్ద ఎత్తున తరలిరావాలని విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థుల సంయుక్త కార్యాచరణ సమితి నాయకులు భాను ప్రకాష్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యకర సమాజం

- చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ.. గర్భిణులు, బాలింతలకు అవగాహన
- ప్రతి కుటుంబంలో పోషణపై చైతన్యం పెరగాలి– అంగన్వాడి సూపర్‌వైజర్ చంద్రకళ

వరంగల్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పోషకాహారమే పునాది అని అంగన్వాడి సూపర్‌వైజర్ చంద్రకళ అన్నారు. వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సమతుల్య ఆహారం, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై చంద్రకళ అవగాహన కల్పించారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో కీలకమని తెలిపారు. గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పాలు, గుడ్లు వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను చేర్చుకోవాలని సూచించారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అరికట్టేందుకు



తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, అంగన్వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారుల ఎదుగుదల, బరువు, ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన సూచనలు అందిస్తున్నామని చంద్రకళ తెలిపారు. ప్రతి కుటుంబంలో పోషకాహారంపై అవగాహన పెరిగినప్పుడే ఆరోగ్యవంతమైన తరాన్ని తీర్చిదిద్దగలమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు సుగుణ, మంజుల, కార్యకర్తలు, ఆయాలు, మహిళలు, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐగా జయశ్రీ బాధ్యతల స్వీకరణ

- అక్రమ మద్యం, గుడుంబాపై ప్రత్యేక నిఘా
- వర్ధన్నపేటను గుడుంబా రహిత మండలంగా తీర్చిదిద్దడమే లక్ష్యం – సీఐ జయశ్రీ



వరంగల్/ వర్ధన్నపేట, సెప్టెంబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా జయశ్రీ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే మండలంలోని అక్రమ మద్యం, గుడుంబా తయారీ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఆమె తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో గుడుంబా తయారీ, అక్రమ మద్యం విక్రయాలు కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. అక్రమ మద్యం కారణంగా కుటుంబాలు, యువత, గ్రామీణ సమాజంపై పడుతున్న ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని గుడుంబా తయారీ కేంద్రాలు, అక్రమ మద్యం విక్రయాలపై నిఘా పెంచుతామని చెప్పారు. గ్రామాల్లో గుడుంబా, అక్రమ మద్యం నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటాం. వర్ధన్నపేటను గుడుంబా రహిత మండలంగా తీర్చిదిద్దడమే లక్ష్యం. అక్రమ మద్యం తయారీ, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం" అని సీఐ జయశ్రీ స్పష్టం చేశారు. కొత్త సీఐ బాధ్యతలు చేపట్టడంతో వర్ధన్నపేట మండలంలో అక్రమ మద్యం, గుడుంబా నియంత్రణపై ఎక్సైజ్ శాఖ ఎలాంటి చర్యలు చేపట్టనుందనే దానిపై ఆసక్తి నెలకొంది. గ్రామాల్లో తనిఖీలు, నిఘా, దాడులను ముమ్మరం చేస్తారా అన్నది రానున్న రోజుల్లో తేలనుంది

ప్రజావాణి దరఖాస్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

- సమస్యలను కాలపరిమితిలో పరిష్కరించాలి
- ప్రజా పోరాట సమితి డిమాండ్



ములుగు జిల్లా/వాజేడు, సెప్టెంబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులపై అధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజా పోరాట సమితి డిమాండ్ చేసింది. ప్రజల సమస్యల పరిష్కారం కోసం సమితి ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు పలు దరఖాస్తులు అందజేసినట్లు నాయకులు తెలిపారు. ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించడంతోనే అధికారులు బాధ్యత ముగిసినట్లు భావించకుండా, వాటిపై సంబంధిత శాఖల అధికారులు వెంటనే విచారణ చేపట్టి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రజలకు సంబంధించిన రహదారులు, వంతెనలు, విద్య, మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకువచ్చామని తెలిపారు. ఏళ్ల తరబడి పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తుపై తీసుకున్న చర్యలను సంబంధిత దరఖాస్తుదారులకు తెలియజేయడంతో పాటు, సమస్యల పరిష్కారానికి స్పష్టమైన కాలపరిమితిని నిర్ణయించి చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ప్రజా పోరాట సమితి నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముత్తెబోయిన మహేందర్, గార రవికుమార్, కుమ్మరి శ్రీనాథ్, గగ్గురి నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

- ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ దిలీప్
- ప్రతి విద్యార్థి మొక్కలు నాటి సంరక్షించాలి



కరీంనగర్/జమ్మికుంట, సెప్టెంబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ దిలీప్ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మానవాళి మనుగడకు మొక్కలే ఆధారమని అన్నారు. “అమ్మ జన్మనిస్తే.. చెట్టు పునర్జన్మనిస్తుంది” అని పేర్కొంటూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు విరివిగా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం ఎంతో అవసరమని తెలిపారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులు తమ నివాస ప్రాంతాల్లోని ఖాళీ ప్రదేశాలను గుర్తించి మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించవచ్చని అన్నారు. ప్రతి విద్యార్థి పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా స్వీకరించి, పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రమేష్, అధ్యాపకులు ఓదెలు కుమార్, గణేష్, రాజేందర్, రవీందర్, ఎన్ఎస్ఎస్ విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలను ఉధృతం చేయాలి

- పేద ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడాలి : సూడి కృష్ణారెడ్డి
- పడిగాపూర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ



ములుగు జిల్లా/తాడ్వాయి, సెప్టెంబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. తాడ్వాయి మండల పరిధిలోని పడిగాపూర్ గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సూడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం 1946 నుంచి 1951 వరకు సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో వామపక్ష శక్తులు కీలకంగా పోరాడాయని పేర్కొన్నారు. ఆ పోరాట చరిత్రను ప్రస్తుతం బీజేపీ వక్రీకరిస్తోందని ఆయన ఆరోపించారు. కులమతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. పేదలు, కార్మికులు, రైతులు, అణగారిన వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాటం అందించిన పోరాట స్ఫూర్తిని నేటి ప్రజా ఉద్యమాల్లో కొనసాగించాలని ఆయన అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పేద ప్రజలకు అండగా నిలవాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విఘ్నాలు తొలగాలి.. వర్షాలు సమృద్ధిగా కురవాలి!

- ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుడికి వైభవంగా అగ్ని హోమం
- ప్రజల ఆయురారోగ్యాలు, రైతుల పాడిపంటల సమృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు



వరంగల్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వరుడికి అగ్ని హోమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, హోమాగ్ని జ్వాలలు, భక్తుల గణనాథుడి నామస్మరణలతో మండపం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం నిర్వహించిన ప్రత్యేక పూజలు, అగ్ని హోమానికి భక్తులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వేదపండితులు కలకోట రాంబాబు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, మంత్రోచ్చారణలు, హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు హోమంలో పూజా ద్రవ్యాలను సమర్పించి విఘ్నేశ్వరుడి ఆశీస్సులు కోరుకున్నారు.

ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థనలు

ప్రజల కష్టాలు తొలగి ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ అగ్ని హోమం నిర్వహించినట్లు నిర్వాహకులు గుజ్జ వీర రాఘవ రావు–పద్మ, గడ్డం సంతోష్–మమత దంపతులు తెలిపారు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాలని, రైతుల పంటలు పుష్కలంగా పండాలని, గ్రామాలు సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు ధనధాన్యాలు సమృద్ధిగా లభించాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు వారు పేర్కొన్నారు.

ప్రత్యేక పూజల్లో ప్రముఖుల పాల్గొనడం

అగ్ని హోమ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ–వర దరాజేశ్వర్‌రావు దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. 3వ వార్డు కౌన్సిలర్ గుజ్జ వీర రాఘవరావు–పద్మ దంపతులు కూడా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా ద్రవ్యాలను హోమాగ్నికి సమర్పిస్తూ తమ కుటుంబాలపై విఘ్నేశ్వరుడి కృప ఉండాలని ప్రార్థించారు. దీంతో వినాయక మండపం భక్తి భావంతో మార్మోగింది. కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు, హోమ నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బూడిద చంద్రగిరికి ఓయూ డాక్టరేట్

- ఔషధ మొక్కలపై పరిశోధనకు పీహెచ్‌డీ పట్టాయాదగిరిగుట్టకు చెందిన చంద్రగిరికి అభినందనల వెల్లువ



యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ బూడిద స్వామి–నాగమ్మ దంపతుల పెద్ద కుమారుడు బూడిద చంద్రగిరి ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఈ నెల 8న హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన 85వ స్నాతకోత్సవంలో ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయ ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి భారత్ బయోటెక్ వ్యవస్థాపకుడు, చైర్మన్, పద్మభూషణ్ డాక్టర్ కృష్ణ ఎం. ఎల్లా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం పాల్గొన్నారు. వారి చేతుల మీదుగా బూడిద చంద్రగిరి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు.ఉస్మానియా విశ్వవిద్యాలయం రసాయన ఇంజినీరింగ్ విభాగంలోని బయోటెక్నాలజీ అంశంలో ప్రొఫెసర్ పి. రాజారావు పర్యవేక్షణలో చంద్రగిరి పరిశోధన చేశారు. ‘ఐసోలేషన్, ప్యూరిఫికేషన్ అండ్ ఫైటో కెమికల్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ థెరప్యూటిక్ లీడ్స్ ఫ్రమ్ చెయిలాంథెస్ అల్యోబ్మార్జినాటా అండ్ ఇన్వెస్టిగేటింగ్ దేర్ యాంటీ క్యాన్సర్ మెకానిస్టిక్ ఇన్‌సైట్స్ యూజింగ్ ఇన్ విట్రో అండ్ ఇన్ వివో ఎవాల్యూషన్ స్టడీస్’ అనే అంశంపై పరిశోధన పత్రాలను సమర్పించారు. పరిశోధనను పరిశీలించిన అనంతరం విశ్వవిద్యాలయ అధికారులు చంద్రగిరికి పీహెచ్‌డీ డిగ్రీని ప్రదానం చేశారు. డాక్టరేట్ సాధించిన చంద్రగిరిని గ్రామస్తులు, బంధుమిత్రులు, స్నేహితులు అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

- రూ.3 లక్షలతో నిర్మాణం.. మహిళల ఆత్మగౌరవానికి ప్రాధాన్యం
- ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకోవాలి: ఉప సర్పంచ్ గాదెపాక కిరణ్



జనగామ జిల్లా/పాలకుర్తి, సెప్టెంబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో ప్రతి వారం నిర్వహించే సంతకు వచ్చే వ్యాపారులు, కొనుగోలుదారులు, ప్రజల సౌకర్యార్థం స్వచ్ఛ భారత్ పథకంలో భాగంగా రూ.3 లక్షలతో మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. స్థానిక ఉప సర్పంచ్ గాదెపాక కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆత్మగౌరవానికి, ప్రజల సౌకర్యానికి మరుగుదొడ్లు ఎంతో ముఖ్యమని అన్నారు. నిర్మాణం పూర్తయిన అనంతరం ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంతకు వచ్చే ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు గ్రామపంచాయతీ తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు కత్తుల నరేష్, సలేంద్ర, రమా సోమన్న, వీరమనేని హనుమంతరావు, కత్తి దస్తగిరి, కమ్మగాని సుధాకర్, నెమరుగ మ్ముల శ్రీనివాసరావు, కామారపు సునీల్, ఈజీఎస్ సాంకేతిక సహాయకుడు కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

కేయూలో ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

- సుమారు 200 మంది పూర్వ సమన్వయకర్తలు, అవార్డు గ్రహీతలు, వాలంటీర్లకు సన్మానం
- సేవా స్ఫూర్తిని చాటేలా సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు

హనుమకొండ, సెప్టెంబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): కాకతీయ విశ్వవిద్యాలయ గోల్డెన్ జూబిలీ వేడుకల్లో భాగంగా జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఈ నెల 24న ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, ఓఎస్డీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ద్వారా విశిష్ట సేవలు అందించిన పూర్వ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు, జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీతలు, పూర్వ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కలిపి సుమారు 200 మందిని ఘనంగా సన్మానించనున్నట్లు ఆచార్య ఈసం నారాయణ వెల్లడించారు. అదేవిధంగా ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల ప్రాధాన్యతను ప్రతిబింబించేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయ గోల్డెన్ జూబిలీ వేడుకల



సందర్భంగా ఎన్ఎస్ఎస్ సేవా ప్రస్థానాన్ని స్మరించుకోవడంతో పాటు, గతంలో సేవలందించిన వారిని సత్కరించడం ద్వారా ప్రస్తుత, భవిష్యత్ తరాల వాలంటీర్లలో సేవా స్ఫూర్తిని మరింతగా పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

యూజీడీ టెండర్లకు వేగం

- 15 రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలి
- అధికారులకు సీడీఎంఏ డాక్టర్ టీకే. శ్రీదేవి ఆదేశాలు

హనుమకొండ, సెప్టెంబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి) : గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ప్రాజెక్టు టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర సీడీఎంఏ డాక్టర్ టీకే. శ్రీదేవి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలోని అంశాలను క్రోడీకరించి, అవసరమైన ప్రక్రియలను పూర్తి చేసి 15 రోజుల్లోగా టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి గ్రేటర్ వరంగల్ మహానగరంలో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టుపై డీపీఆర్, టెండర్ ప్రక్రియ, పనులు చేపట్టే విధానంపై సీడీఎంఏ డాక్టర్ టీకే. శ్రీదేవి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, కమిషనర్ టి. వెంకన్నతో పాటు ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీడీఎంఏ మాట్లాడుతూ యూజీడీ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని



సూచించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన ప్రక్రియ, టెండర్ల ఆహ్వానానికి తీసుకుంటున్న చర్యలను సీడీఎంఏకు వివరించారు. యూజీడీ ప్రాజెక్టుకు సంబంధించి ఏవైనా సమస్యలు తలెత్తితే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ రవికుమార్, సీపీఓ రవీంద్ర రాడేకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఉనికిచెర్లలో 'లయన్స్ క్వెస్ట్'కు శ్రీకారం

- కాజీపేట మండల ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ
- విద్యార్థుల్లో నాయకత్వం, వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక దృష్టి



హనుమకొండ, సెప్టెంబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): కాజీపేట మండలంలోని హైస్కూల్ ఉపాధ్యాయులకు లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల 'నాలుగో లయన్స్ క్వెస్ట్' ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమం బుధవారం ఉనికిచెర్లలోని శ్రీనివాస రామానుజం కాన్సెప్ట్ స్కూల్‌లో ఘనంగా ప్రారంభమైంది. లయన్స్ క్లబ్ ఆఫ్ హన్మకొండ తౌసెండ్ పిల్లర్స్ ఆతిథ్య క్లబ్‌గా వ్యవహరిస్తోంది. డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ నరహరి సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. 6, 7, 8 తరగతుల విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, మనోధైర్యం, క్రమశిక్షణ, మంచి పౌర లక్షణాలను పెంపొందించే అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తున్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో విద్యార్థులకు ఈ అంశాలను బోధించనున్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ గుర్తింపు పొందిన శిక్షకురాలు ఎస్. రేణుక శిక్షణ అందిస్తున్నారు. గురువారంతో ముగియనున్న కార్యక్రమంలో విద్యార్థులకు సుమారు రూ.300 విలువైన శిక్షణా పుస్తకాలను అందజేయనున్నారు. శిక్షణ పూర్తి చేసిన ఉపాధ్యాయులకు ధ్రువపత్రాలను ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ గవర్నర్ నరహరి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ శిక్షణలోని అంశాలను ఉపాధ్యాయులు పూర్తిగా అవగతం చేసుకుని భావితరాలను సన్మార్గంలో నడిపించడంలో భాగస్వాములు కావాలని కోరారు. ఐపీడీజీ, మల్టిపుల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య మాట్లాడుతూ 11 నుంచి 14 ఏళ్ల కౌమార దశ పిల్లలను సరైన మార్గంలో నడిపించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, లయన్స్ క్వెస్ట్ కార్యక్రమం ఇందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. డిస్ట్రిక్ట్ క్వెస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ కానుగంటి సుభాష్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఎస్వీడీజీ లయన్ రమణారెడ్డి, కాజీపేట ఎంఈఓ బండారి మనోజ్ కుమార్, జిల్లా కేబినెట్ కార్యదర్శి పాము శ్రీనివాస్, తౌసెండ్ పిల్లర్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ వైద్యం రాజగోపాల్, కార్యదర్శి గంజి నరహరి, అక్షర స్కూల్



ప్రిన్సిపల్ రాగిడి నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 15 పాఠశాలలకు చెందిన 30 మంది ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొన్నారు.

కాళికామాత ఆలయంలో,గోల్డ్ ఫేస్ కాలనీలో కొలువైన గణనాథుడు

- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు





నిత్యం నిఘా, షాబాద్, సెప్టెంబర్ 16 : వినాయక చవితి సందర్భంగా షాబాద్ మండలంలోని లక్ష్మీ దేవి(కాళికామాత) ఆలయంలో,గోల్డ్ ఫేస్ కాలనీలో గణనాథుడు కొలువుదీరాడు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య గణపతికి పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారికి పుష్పాలు, పత్రి, నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు,అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు

- అధికారులను ఆదేశించిన చైర్మన్ జాము రవి



నిత్యం నిఘా, శామీర్ పేట, సెప్టెంబర్ 16 : వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ జాము రవి అధికారులను ఆదేశించారు. మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వినాయక మండపాల అధ్యక్షులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. చైర్మన్ జాము రవి అధ్యక్షతన, కమిషనర్ వెంకట గోపాల్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నిమజ్జన ఏర్పాట్లపై చర్చించారు.ఉద్దేమరి, కొల్తూర్, లక్ష్మాపూర్ ప్రాంతాల్లో నిమజ్జన మార్గాలు, పరిసర ప్రాంతాలను అధికారులతో కలిసి చైర్మన్ పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా రహదారులు, పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలు పాటించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని చైర్మన్ కోరారు. మండపాల అధ్యక్షులు తమ ప్రాంతాల్లోని సమస్యలు, అవసరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.సమావేశంలో షామీర్‌పేట్ ఎస్‌హెచ్ఓ నరసింహారెడ్డి, జీనోమ్ వ్యాలీ ఎస్‌హెచ్ఓ గురువయ్య, కౌన్సిలర్ ర్యాకల నీరజ్ గౌడ్, గిరిపల్లి రమేష్, మెరుపాటి గోవర్ధన్‌రెడ్డి, బొమ్మలపల్లి మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, బసవరెడ్డి, మున్సిపల్ రెవెన్యూ అధికారి అర్షద్ అహ్మద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

గణేష్ లడ్డూ వేలంలో రూ.41,111కు ప్రసాదం దక్కించుకున్న అర్ద సుధాకర్‌రెడ్డి



నిత్యం నిఘా, వికారాబాద్, సెప్టెంబర్ 16 : వికారాబాద్ పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన గణేష్ లడ్డూ ప్రసాదం వేలంపాటలో మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, టీజేఎంయూ గౌరవ అధ్యక్షులు అర్ద సుధాకర్‌రెడ్డి రూ.41,111లకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. గణనాథునిపై భక్తి, విశ్వాసంతో వేలంపాటలో పాల్గొని లడ్డూను సొంతం చేసుకున్నారు.ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. గణేష్ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలంపాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భక్తులు "జై బోలో గణేష్ మహారాజ్ కీ జై" అంటూ నినాదాలు చేశారు.

వైద్య సిబ్బందికి పాలన అంశాలపై శిక్షణ



నిత్యం నిఘా, నిజామాబాద్, సెప్టెంబర్ 16 : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని వైద్య సిబ్బంది,పిహెచ్సి మినిస్టీయల్ సిబ్బందికి డ్రాప్టింగ్,పాలన పరమైన అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ రాజశ్రీ తెలియజేశారు.వైద్య సిబ్బంది పాలనా పరమైన అంశాల్లో,డ్రాప్టింగ్,ప్రొసీడింగ్స్,లెటర్ రైటింగ్,లీవ్స్ రూల్స్,ఆఫీస్ సబార్డినేట్ రూల్స్,మెమో,షో కాజ్ నోటీసు ఇవ్వడం,ఆర్ టి ఐ కేసెస్,కోర్టు కేసెస్ డీల్ చేయడం మొదలగు అన్ని అంశాలపై రిటైర్డ్ కార్మిక అధికారి యోహాన్ శిక్షణ ఇవ్వడం జరిగింది.కాబట్టి ఈ సందర్భంగా వైద్య సిబ్బంది అడిగిన సందేహాలకు జవాబులు ఇవ్వడం జరిగింది.ఇంకా ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ ఏవో సుమంత్ కుమార్,ఎస్ఓ రాజేశ్వర్ సూపరిండెంట్లు వినయ్ కుమార్,షకీల్,వెంకటేశ్వర్లు,సందీప్ కార్యాలయ సిబ్బంది వివిధ పిహెచ్సి ల మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

సేవలను గుర్తించి ఉపాధ్యాయులకు సత్కారం

- **విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత కీలకం మండల విద్యాధికారి- పగిడిపాటి నరసింహ**



నిత్యం నిఘా, డిండి (గుండ్లపల్లి), సెప్టెంబర్ 16 : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని డిండి (గుండ్లపల్లి) మండలంలో ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.మండలంలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో విశేష కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించి, వారి సేవలకు గుర్తింపుగా సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా బ్రహ్మచారి, జీహెచ్ఎం నారాయణరెడ్డి, టీజీ ఎంఎస్ ప్రిన్సిపల్, సరోజ, దివ్యశ్రీ, కవిత, ఈశ్వరమ్మ, విజయలక్ష్మి , ఆవుల మధు, సంతోషి, వరలక్ష్మి , సుజాత, వెంకటేష్, కృష్ణవేణి, రాము నాయక్‌లను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పగిడిపాటి నర్సింహ, ఎంపీవో జంగయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గీతాంజలి, శ్రీను, మండలంలోని ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి సత్కరించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ప్రశాంత్ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు

- **బూడిద నందారెడ్డి - ప్రభావతి దంపతుల ఆధ్వర్యంలో భారీ అన్నప్రసాద వితరణ**
- **దాదాపు 2,000 మందికి పైగా భక్తుల హాజరు**





నిత్యం నిఘా, వనస్థలిపురం, సెప్టెంబర్ 16 : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రశాంత్ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం భారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సేవా కార్యక్రమానికి బీఎన్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్, తెలంగాణ స్టేట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, తెలంగాణ స్టేట్ క్రషర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బూడిద నందా రెడ్డి – ప్రభావతి దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు అన్నదాన దాతలుగా వ్యవహరించారు.ముందుగా గణనాథుడికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించిన అనంతరం నందా రెడ్డి కుటుంబ సమేతంగా భక్తులకు అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ నగర్ కాలనీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తరలివచ్చిన దాదాపు 2,000 మందికి పైగా భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బూడిద నందా రెడ్డి మాట్లాడుతూ — "విఘ్నాలను తొలగించి సకల శుభాలను చేకూర్చే వినాయకుడి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలన్నదే మా ఆకాంక్ష. 'అన్నదానం మహాదానం'.. ఆకలి తీర్చడంలో ఉండే తృప్తి మరెందులోనూ లభించదు. భగవంతుని సేవతో పాటు మానవ సేవలో భాగస్వామ్యం కావడం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. ఇలాంటి పుణ్యకార్యాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి. ఇంతటి పవిత్రమైన కార్యక్రమాన్ని క్రమశిక్షణతో, నిబద్ధతతో విజయవంతంగా నిర్వహించిన ప్రశాంత్ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులను, స్థానిక యువతను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, కాలనీవాసులు, గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

అభివృద్ధికి అలియాబాద్ కౌన్సిల్ పెద్దపీట

- **రూ.1.38 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం.. పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రహదారులపై కీలక నిర్ణయాలు**





నిత్యం నిఘా, శామీర్ పేట, సెప్టెంబర్ 16 : ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ అలియాబాద్ పురపాలక సంఘాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కౌన్సిల్ సమష్టిగా కృషి చేయాలని పురపాలక సంఘ చైర్‌పర్సన్ కంటం శిరీష కృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలతో పాటు ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.అలియాబాద్ పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ కంటం శిరీష కృష్ణారెడ్డి అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చించి, సుమారు రూ.1.38 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వార్డుల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, మౌలిక వసతుల అవసరాలపై కౌన్సిలర్లు చర్చించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పురపాలక సంఘ పరిధిలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నిర్ణీత గడువులో పనులను పూర్తి చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణను మరింత పటిష్టం చేయాలని పేర్కొన్నారు.కౌన్సిల్ సమావేశంలో పారిశుద్ధ్య నిర్వహణ, భూగర్భ మురుగునీటి కాలువల నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, అంతర్గత రహదారుల మరమ్మతులు, వీధి దీపాల నిర్వహణ, పార్కులు, హరిత ప్రాంతాల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. ఆయా పనులకు సంబంధించిన పరిపాలనాపరమైన అనుమతులు, అభివృద్ధి చర్యలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.వైస్ చైర్‌పర్సన్ మాలతి మాధవరెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన పౌర సేవలు అందించేందుకు పురపాలక సంఘం తరఫున చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వార్డుల వారీగా ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కౌన్సిల్ ఆమోదించిన అభివృద్ధి పనులను నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి నిర్ణీత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రహదారులు, వీధిదీపాలు తదితర పౌర సేవలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.సమావేశంలో కౌన్సిలర్లు తమ తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలపై చర్చించిన కౌన్సిల్ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు పలు నిర్ణయాలు తీసుకుంది. సమావేశంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారత్ నగర్‌లో ఘనంగా బాల గణపతి నవరాత్రి ఉత్సవాలు



నిత్యం నిఘా, గజ్వేల్, సెప్టెంబర్ 16 : సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు భారత్ నగర్‌లో "గరుడ యూత్" ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు ఎంతో ఘనంగా జరుగుతున్నాయి. గరుడ యూత్ సభ్యులు, కాలనీలో చిన్నారులు ఎంతో ఉత్సాహంతో, వైవిధ్యభరితంగా గణపతి మండపాన్ని అలంకరించి 'బాల గణపతి' విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా బుధవారం నాటి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి చిన్నారులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులైన చిన్నారులు మాట్లాడుతూ కాలనీవాసులు, భక్తులందరూ బాల గణపతిని దర్శించుకుని స్వామివారి దివ్య ఆశీస్సులు పొందాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం గణేశుని మహా ప్రసాదమైన లడ్డూ కోసం రూ. 25 లకే ఒక టోకెన్ అందజేస్తున్నామని చిన్నారులు వెల్లడించారు. భక్తులందరూ విశేష సంఖ్యలో విచ్చేసి, స్వామి వారిని దర్శించుకోవడం తో పాటు లడ్డు టోకెన్లు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గరుడ యూత్ సభ్యులు, స్థానిక చిన్నారులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com